సాక్షి
బాపట్ల
ఆదివారం । 26 । మార్చి । 2023



సమ్మేళనానికి ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో 27 నుంచి వచ్చే నెల 13 వరకు నిర్వహించనున్న సాంకేతిక సమ్మేళనం పోస్టర్లను శనివారం వైస్ చాన్స్‌లర్ జీవీఆర్ ప్రసాదరావు ఆవిష్కరించారు.



మల్లిఖార్జునుడి సేవలో....

రెంటచింతల: స్థానిక గంగా భ్రమరాంబా మల్లిఖార్జున స్వామి వారిని ఏపీ జెన్‌కో ఎండీ శ్రీధర్ శనివారం దర్శించుకున్నారు. దేవాలయ అభివృద్ధిపై పలువురు ఆయనతో మాట్లాడారు.



బాపట్లలో కొవ్వొత్తుల వెలుగులు

బాపట్ల అర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ఎర్త్ అవర్ కార్యక్రమం శనివారం సాయంత్రం 3.30 నుంచి రాత్రి 7:30 గంటల వరకు నిర్వహించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
బాపట్ల	6:25	4:51
గుంటూరు	6:25	4:51
నరసరావుపేట	6:27	4:49

న్యూస్‌రీల్

మహిళల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: గ్రామ స్థాయి నుంచి మహిళలు, చిన్నారుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారుల సమావేశం శనివారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలికల్లో రక్త హీనతను గుర్తించి పౌష్టికాహారం, మందులు అందించాలని చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు ఎత్తు, బరువును గుర్తించాలని కోరారు. బడిమానేసిన 566 పిల్లలను ఇప్పటికే చేర్పించారని మిగిలిన వారినీ గుర్తించి చేర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న పోషణ ఆహారాన్ని తీసుకునేందుకు 5694 మంది అంగీకరించారన్నారు. వీరిలో 3,600 తీసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయని చెప్పారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెల్ ద్వారా లక్ష్యాలు అధిగమించని అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలని చెప్పారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శ్రావణ్ బాబు, డీఈఓ శైలజ, సీపీఓ ఉషశ్రీ, ఐసీడీఎస్ పీడీ మనోరంజని పాల్గొన్నారు.

28న కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీ టోర్నమెంట్

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ఈనెల 28 తేదీ నుంచి కలెక్టర్స్ క్రికెట్ ట్రోఫీ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ ఎస్.పల్లవి, డీఎస్ఏ స్టేడియం చీఫ్ కోచ్ సి.హెచ్.శ్రీనివాసరావు శనివారం తెలిపారు. జిల్లా పరిధిలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఏడు టీంలను ఎంపిక చేసి టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఇందులో భాగంగా నరసరావుపేట నియోజకవర్గ స్థాయి టీం ఎంపికలు ఈనెల 26వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రికెట్ క్రీడాకారులు ఎంపిక పోటీలో పాల్గొనాలని కోరారు.

ఇంటర్ పరీక్షల్లో ముగ్గురు డీబార్

బాపట్ల అర్బన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫిజిక్స్ పరీక్షల్లో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయ్యారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన వీరిని అధికారులు గుర్తించారు. శనివారం జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాల్లో ఇంటర్ ఫిజిక్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ అధికారి కె.ఆంజనేయులు తెలిపారు. మొత్తం 10,321 మంది విద్యార్థులకుగాను 9,786 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు. 535 మంది గైర్హాజరవడంతో 94.82 హాజరు నమోదైనట్లు తెలిపారు. ఆర్జేడీ, డీవీఈవో, డీఈసీ, హెచ్‌పీసీ అధికారులు ఎనిమిది సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 9 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు నాలుగు సెంటర్లను తనిఖీ చేశారు. తాము వేటపాలెం, చీరాలలోని నాలుగు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయగా ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లిలోని గీతం జూనియర్ కాలేజీలో ముగ్గురు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతుండగా పట్టుకున్నామని, వారిని డీబార్ చేశామని వెల్లడించారు.

రీ సర్వే పరుగులు

88 గ్రామాల పరిధిలో సర్వే
55 గ్రామాల్లో ఓఆర్ఐ మ్యాప్‌లు

- 23 గ్రామాల పరిధిలో భూ హక్కు పత్రాలు పంపిణీ
- ప్రభుత్వ ఖర్చులతోనే సబ్‌డివిజన్
- అసైన్డ్ భూముల ఆక్రమణదారులకు నోటీసులు
- మిగిలిన గ్రామాల పరిధిలోనూ త్వరలో రీ సర్వే



రీసర్వే చేస్తున్న సర్వేయర్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం దశాబ్దాల నాటి భూ సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా చారిత్రాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వే జిల్లాలో అత్యంత వేగంగా సాగుతోంది. జిల్లాలోని 25 మండలాల పరిధిలో 277 రెవెన్యూ గ్రామాలు ఉండగా తొలుత 13 మండలాల్లోని 88 రెవెన్యూ గ్రామాల పరిధిలో రీ సర్వే ప్రారంభమైంది. ఇప్పటికే 88 గ్రామాల్లో రీసర్వేకు సంబంధించిన డ్రోన్ సర్వే నిర్వహించారు. మొదటి ఫేజ్‌లో 24 గ్రామాలు, రెండవ ఫేజ్‌లో 23, మూడవ ఫేజ్‌లో 8 గ్రామాల చొప్పున మొత్తం 55 గ్రామాల పరిధిలో డ్రోన్ సర్వే పూర్తిచేసి ఓఆర్ఐ (ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజ్) మ్యాప్‌లు సిద్ధమయ్యాయి. మొత్తం 24 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. మిగిలిన 23 గ్రామాల్లో.. 12 గ్రామాల్లో రీసర్వే పూర్తికాగా, మిగిలిన 11 గ్రామాల్లో ఏప్రియల్ 15 నాటికి సర్వే పూర్తికానుంది.

సర్వే పూర్తి చేసిన 24 గ్రామాల పరిధిలో 32,239 సర్వేరాళ్లు దిగుమతి చేసుకోగా 17 గ్రామాల పరిధిలో 22,818 సర్వేరాళ్లు నాటారు. మిగిలిన 7 గ్రామాల పరిధిలో ఏప్రిల్ మొదటివారం నాటికి సర్వేరాళ్లు నాటనున్నారు. ఇవన్నీ పూర్తికాగానే మిగిలిన 12 మండలాల్లో రీసర్వే మొదలుపెట్టనున్నారు. 12 మండలాల పరిధిలో 9 లక్షల సర్వేనెంబర్లు ఉండగా, ఇప్పటికే 1.30 లక్షల సర్వేనెంబర్లు వెరిఫై చేశారు. త్వరలో ఆ మండలాల్లో సైతం రీ సర్వే ప్రారంభం కానుంది.

భూహక్కు పత్రాల పంపిణీ

23 గ్రామాల పరిధిలో 13,897 భూ హక్కు పత్రాలు సిద్ధం కాగా, ఇప్పటివరకు 13,042 (94 శాతం) భూ హక్కుపత్రాలు పంపిణీ చేశారు. పందిళ్లపల్లి గ్రామం పరిధిలో అసైన్డ్ భూమి అధికంగా ఉండటంతో సదరు సర్వేనెంబర్ల రైతులకు నోటీసులు జారీ చేశారు. ఇవి క్లియర్ కాగానే మిగిలిన వారికి భూ హక్కు పత్రాలు పూర్తిగా పంపిణీ చేయనున్నారు.

రీసర్వేతో ఉపయోగాలు!

ఇప్పటివరకు 23 గ్రామాల పరిధిలో సాగులో ఉన్న 1324 సర్వేనెంబర్లకు సంబంధించి పలు రెవెన్యూ సమస్యలను క్లియర్ చేశారు. 293 సరిహద్దు వివాదాలను పరిష్కరించారు. పొలం సబ్ డివిజన్ చేసుకోవాలంటే ఒక్కో రైతు రూ. 550 చలానా చెల్లించాల్సి ఉంది. రీసర్వేలో భాగంగా ఇప్పటి వరకు 9831 మందికి సంబంధించి ఒక్క రూపాయి కూడా కట్టించుకోకుండా ప్రభుత్వమే సబ్‌డివిజన్ చేసింది. దీంతో రైతులకు 54,07,050 ఆదా అయ్యింది. 139 సర్వేనెంబర్ల పరిధిలో మ్యూటేషన్ చేయటం వలన రైతులకు రూ. 2,19,450 ఆదా అయ్యింది. ప్రస్తుతం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం ఆరు నెలలు సమయం పట్టేది. కానీ 45 రోజుల వ్యవధిలోనే సబ్‌డివిజన్, ఇతర రెవెన్యూ సమస్యలను పరిష్కరించారు. ఇప్పటి వరకు 600 ఎకరాల అసైన్డ్ భూములకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. రీసర్వేతో పలు రకాల రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభించడంతోపాటు ఆక్రమణలో ఉన్న అసైన్డ్ భూములకు విముక్తి లభించనుంది.

రెవెన్యూ సమస్యలకు పరిష్కారం



ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూసర్వేతో రెవెన్యూ సమస్యలకు పరిష్కారం లభించనుంది. జిల్లాలో 277 రెవెన్యూ గ్రామాలుండగా 88 గ్రామాల పరిధిలో సర్వే చేపట్టాం. 55 గ్రామాల పరిధిలో డ్రోన్‌సర్వే పూర్తి అయ్యింది. 23 గ్రామాల పరిధిలో భూ హక్కుపత్రాలు పంపిణీ చేశాం. మిగిలిన గ్రామాల్లోనూ సర్వే వేగంగా జరుగుతోంది. రైతుల భూములను సబ్‌డివిజన్ చేయడంతో ఇతర సమస్యలకు పరిష్కారం లభించింది. ఆక్రమణదారుల చేతుల్లో ఉన్న అసైన్డ్‌భూములకు రీసర్వేతో విముక్తి లభించనుంది. ప్రభుత్వ ఖర్చులతోనే సబ్ డివిజన్లు చేస్తున్నాం.

– కె. శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్



చెక్కు పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, డాక్టర్ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కోన రఘుపతి

ఆసరాతో పోషణకర్తలుగా మహిళలు

- చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి
- ఘనంగా మూడోవిడత జమ

బాపట్ల: మహిళలను పోషణకర్తలుగా చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని ఏపీ లెజిస్లేటివ్ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. పురుషులతో సమానంగా మహిళలు ఎదగడానికి అన్ని అవకాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి కల్పిస్తున్నారన్నారు. ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి 32 పథకాలను సమర్థంగా అమలు చేస్తున్నారన్నారు. ఆర్థిక, రాజకీయ రంగంలోను మహిళలకు సమాన హక్కులు, హోదా కల్పిస్తున్నారని వివరించారు.

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మీ పిల్లల ఉన్నత భవిష్యత్‌కు చక్కని బాటలు వేయడానికే ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. 30,604 పొదుపు సంఘాల్లో మూడు లక్షల మంది మహిళలకు రూ.263.61 కోట్లు నిధులు విడుదల అయ్యాయన్నారు. కుల, మత, రాజకీయ వివక్షత లేని పాలనను రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రంలో అందిస్తున్నారని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. వైఎస్ఆర్ ఆసరా మూడో విడత నగదు పంపిణీ మహిళల జీవితాలను మార్చేస్తుందన్నారు. అందులో భాగంగా బాపట్ల నియోజక వర్గంలోని పొదుపు సంఘాల అప్పులు తీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.120 కోట్ల నిధులను ఇప్పటి వరకు విడుదల చేసిందన్నారు. దీంతో పొదుపు సంఘాలన్నీ ఇప్పుడు చక్కగా నడుస్తున్నాయన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి విశేషంగా కృషి చేస్తున్నారని అభివర్ణించారు. ఏప్రిల్ 7వ తేదీ వరకు పండుగ వాతావరణంలో మహిళలకు నగదు పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.అర్జునరావు, ఎల్‌డిఎంకృష్ణ నాయక్, డీపీఎం లక్ష్మణాచారి పాల్గొన్నారు.

నిబంధనల అతిక్రమణపై కేసు

చిలకలూరిపేట టౌన్: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి భవనాలు, గోదాములు నిర్మించిన వాటిని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. చిలకలూరిపేట మండలంలోని బొప్పూడి గ్రామంలోని మిట్టపల్లి పొగాకు గోదాముతో పాటు పట్టణంలోని సుభాని నగర్, గాంధీపేట, పాతసంత తదితర ప్రాంతాల్లోని హాస్పిటల్, స్కూల్, అపార్ట్‌మెంట్లను క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించినట్లు నిర్ధారించిన అధికారుల బృందం ఆయా భవనాల యజమానులు ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళలకు రూ.2.25 లక్షల కోట్ల లబ్ధి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి విడదల రజిని

- జగనన్నతోనే ఇది సాధ్యం
- మంత్రి విడదల రజిని
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల కాలంలోనే ఏకంగా రూ.2.25 లక్షల కోట్ల విలువైన సంక్షేమాన్ని మహిళలకు అందించిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని నన్నపనేని వెంకటరత్నం కన్వెన్షన్ హాలులో వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పేదలకు రూ.2.25 లక్షల కోట్ల విలువైన లబ్ధిని చేకూరిస్తే, అందులో రూ.1.41 లక్షల కోట్లు నేరుగా డీబీటీ పద్ధతిలో మహిళల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగం పేరిట దోపిడీ

డబ్బులు తిరిగి ఇవ్వమన్నందుకు దాడి

తెనాలిరూరల్: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని యువకులకు మాయ మాటలు చెప్పి ఓ మోసగాడు రూ.ఎనిమిది లక్షలు దండుకున్నాడు. రెండేళ్లవుతున్నా ఉద్యోగం ఊసే లేకపోవడంతో ప్రశ్నించిన యువకులపై కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన యువకులు బ్రహ్మరాజు, నాసరయ్యలు డిగ్రీ పూర్తి చేశారు. వలంటీర్లుగా పని చేసిన వీరికి బ్రహ్మరాజు బాబాయి ద్వారా గుంటూరు జిల్లా నిజాంపట్నంకు చెందిన డి. నాగరాజు (ప్రస్తుతం తెనాలి చినరావూరులో నివాసం) పరిచయమయ్యాడు. తాను ఓ రాజ్యసభ సభ్యుడి పీఏనని, ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని యువకులకు నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన ఇద్దరూ చెరో రూ. నాలుగు లక్షల చొప్పున నాగరాజుకు 2021లో ఇచ్చారు. ఉద్యోగం సంగతి అడుగితే దాటేస్తూ వచ్చాడు. శనివారం సాయంత్రం తెనాలికి వచ్చిన బాధిత యువకులు తమకు డబ్బుతిరిగి ఇచ్చేయమని ఫోనులో కోరారు. చినరావూరు రైల్వే స్టేషన్ శివారుకు వీరిని పిలిపించిన నాగరాజు, తననే డబ్బు అడుగుతారా అంటూ సుమారు 15 మంది యువకులను కర్రలు, కత్తులతో వెంటేసుకొచ్చి బాధిత యువకులపై దాడి చేశాడు. నాసరయ్య తప్పించుకుని పోలీసులు ఫిర్యాదు చేశాడు.

గంజాయి రవాణా ముఠా అరెస్ట్

- రూ.8 లక్షల విలువైన 180 కిలోల గంజాయి స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్, మరొకరి కోసం గాలింపు
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: జిప్సం లోడు ముసుగులో గంజాయిని రాష్ట్రాలు దాటిస్తున్న ఘరానా గంజాయి రవాణా ముఠాను మార్టూరు పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8 లక్షల విలువ చేసే రూ.180 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం ఎస్పీ వకుల్‌జిందాల్ కేసు వివరాలను వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా రౌతపూడి మండలం పరిపాక గ్రామానికి చెందిన కాకాటి లోపరాజు రెండు నెలల నుంచి తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలానికి చెందిన సయ్యద్ రజాక్ వద్ద లారీ డ్రైవర్‌గా, విశాఖపట్నం జిల్లా గంట్యాడ మండలం పితావానిపాలెం గ్రామానికి చెందిన పితాని నాగ అప్పారావు క్లీనర్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న వైజాగ్‌లోని కోరమండల్ ఇండస్ట్రీయల్ లిమిటెడ్‌లో జిప్సం లోడు వేసుకొని, కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గాలోని అల్ట్రాటెక్ లిమిటెడ్ కంపెనీకి తీసుకెళ్లాలని లారీ ఓనర్ డ్రైవర్‌కు సూచించారు. మార్గంలో అనకాపల్లిలోని భారత్ పెట్రోల్ బంకు దగ్గరకు వచ్చిన తరువాత తనకు ఫోన్ చేస్తే వచ్చి కలుస్తానని చెప్పారు. ఓనర్ ఆదేశాల మేరకు ఈ నెల 21న లారీని పెట్రోల్ బంక్ వద్ద నిలుపుదల చేశారు.

లారీ డ్రైవర్ ఇంటికి వెళ్లి స్నానం చేసివచ్చేసరికి లారీ ఓనర్ సయ్యద్ రజాక్ లారీని తీసుకెళ్లి జిప్సం మధ్యలో ఆరు బస్తాల గంజాయిని లోడ్ చేయించి జగ్గంపేట పరిధిలోని ఎర్రవరం టోల్‌గేట్ సమీపంలో డ్రైవర్‌కు అప్పగించాడు. ఈ నెల 24న మార్టూరు సర్కిల్ పరిధిలోని బొల్లాపల్లి టోల్‌ప్లాజా సమీపంలో మార్టూరు సీఐ వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీలో జిప్సం మధ్యలో గంజాయి బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. లారీతో పాటు డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకొని మార్టూరు ఇన్‌చార్జి తహసీల్దార్ బి.వెంకటరెడ్డి సమక్షంలో విచారించారు. జరిగిన వాస్తవాన్ని లారీ డ్రైవర్, క్లీనర్ పోలీసులకు తెలిపారు. దీంతో గంజాయి రవాణాకు పూనుకున్న లారీ డ్రైవర్ కాకాటి లోపరాజు, క్లీనర్ పితాని నాగఅప్పారావును అరెస్ట్ చేసి, గంజాయిని లారీలో లోడ్ చేయించిన లారీ ఓనర్ సయ్యద్ రజాక్ కోసం గాలిస్తున్నారు. అనంతరం కేసును చాకచక్యంగా ఛేదించిన బాపట్ల డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, మార్టూరు సీఐ షేక్ టి.ఫిరోజ్, మార్టూరు ఎస్ఐ కె.కమలాకర్, ఏఎస్ఐ షేక్ మహబూబ్‌బాషా, హెడ్ కానిస్టేబుళ్లు పీవీ సుబ్బారావు, ఇ.కోటేశ్వరరావు, జి.ప్రసాద్, కానిస్టేబుల్ డి.రాజేష్, ఏఆర్‌పీసీ జేపీ గురవయ్యకు ఎస్పీ వకుల్ జిందాల్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

బాపట్లటౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శనివారం నో యాక్సిడెంట్ డేను నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలన్నారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

బాపట్ల: మున్సిపాలిటీలో జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని ప్యాడిసన్‌పేట జగనన్న కాలనీలో జరుగుతున్న గృహ నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల మున్సిపాలిటీ ప్యాడిసన్‌పేట జగనన్న కాలనీ 1740 గృహాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం1409 గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయనీ, ఇప్పటి వరకు ప్రారంభించని గృహ నిర్మాణ లబ్ధిదారులకు 2.90 లక్షల రూపాయలతో మోడల్ హౌస్ నిర్మించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గృహ నిర్మాణాలను ప్రారంభించడానికి అవసరమైన బ్యాంక్ రుణాలను ఇప్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్యాడిసన్‌పేట జగనన్న కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

జె.పంగులూరు: జగనన్న లేఔట్‌లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ జేఎండీ శివప్రసాద్ అన్నారు. ముప్పవరం లేఔట్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం వెంటనే బిల్లులు మంజూరు చేస్తోందన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారు వెంటనే చేపట్టాలన్నారు. ముందుగా జేఎండీ శివప్రసాద్‌ను గ్రామ సర్పంచ్ సాంబశివరావు, ఎంపీటీసీ గంగాధర్ శాలువా కప్పి సన్మానించారు. పీడీ ప్రసాద్, డీఈ శర్మ, ఎంపీడీవో రమణమూర్తి, హౌసింగ్ ఏఈ కిషోర్, పీఆర్ఏఈ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుట్ర రాజకీయాలు బాబుకు వెన్నతో పెట్టినవిద్య

రాజ్యసభ సభ్యుడు
మోపిదేవి వెంకట రమణారావు


మాట్లాడుతున్న మోపిదేవి

రేపల్లె రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండతో గెలుపొందిన పలువురు శాసన సభ్యులు ప్రలోభాలకుగురై అమ్ముడుపోవడంతోనే శాసన సభ కోటాలోని ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ ఒక స్థానాన్ని దక్కించుకుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పేటేరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ విజయంతోనే బైక్ ర్యాలీలు నిర్వహించి టపాసులు పేల్చడం టీడీపీ అల్పానందానికి నిదర్శనమన్నారు. కుట్రలు, కుతంత్రాలతో రాజకీయం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యేనన్నారు. ఎవరూ ఎన్నికుట్రలు పన్నినా ప్రజలు జగనన్న ప్రభుత్వం వైపే ఉన్నారని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

రూ.32 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం..

గతంలో ఎన్నడూ లేనివిధంగా మేజర్ పంచాయతీ పేటేరులో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులకు రూ.32.28 కోట్లు ఖర్చు చేశామని మోపిదేవి తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ ఇన్‌చార్జి కనపర్తి రవికిరణ్, మాజీ ఎంపీటీసీ రావు ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జానపద కళాపీఠం 22వ వార్షికోత్సవం

- ఆకట్టుకున్న కోలాట నృత్యాలు, డప్పు వాయిద్యాలు
- జానపద, రంగస్థల, సాహిత్య కళాకారులకు సన్మానం


రంగస్థల కళాకారుడిని సన్మానిస్తున్న జానపద కళాపీఠం సభ్యులు

అద్దంకి రూరల్: జానపద కళాపీఠం 22వ వార్షికోత్సవాలు శనివారం రాత్రి స్థానిక బంగ్లా రోడ్‌లోని కె.విశ్వనాథ్ స్మారక కళావేదికపై ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం జ్యోతి చంద్రమౌళి ఆధ్వర్యంలో రామసుశీల నిలయంలో బౌద్ధం- జానపదంపై నాగార్జున యూనివర్సిటీ ప్రిన్సిపాల్ చల్లపల్లి స్వరుపారాణితో ఉపన్యాస వేదిక నిర్వహించారు. సాయంత్రం డప్పుకళాకారుల వాయిద్యం, కోలాట బృందాలతో కోలాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జానపద, రంగస్థల సాహిత్య కళాకారులకు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జానపద కళాపీఠం అధ్యక్షుడు ఉబ్బా దేవపాలన మాట్లాడుతూ మరుగున పడిపోతున్న జానపద కళలను, కళాకారులను గుర్తించి వారికి పురస్కారాలను అందిస్తున్నట్లు చెప్పారు. మనిషి జీవితం జానపదంతో ముడిపడి ఉందన్నారు. నేటి ఆస్కార్ అవార్డు జానపద పాట నాటునాటుకు దక్కడంతో ప్రపంచ దేశాల్లో తెలుగు జానపదానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. కళాపీఠం ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎందరో గొప్పగొప్ప జానపద కళాకారులు మన దేశంలో ఉన్నారన్నారు. అనంతరం జ్యోతి శ్రీరాములు స్మారక సాహిత్య పురస్కారాన్ని కోండ్రు నాగమల్లేశ్వరికి, వీరవల్లి రంగయ్య, యశోదమ్మ స్మారక కళాపురస్కారాన్ని తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, గుర్రం జాషువా స్మారక కళాపురస్కారాన్ని జనాబ్ షేక్ కరిముల్లాకు, గోరంట్ల వీరయ్య రుక్మిణమ్మ స్మారకకళా పురస్కారం అవార్డును నిమ్మగడ్డ మీరయ్యకు, మారెడ్డి వెంకటరెడ్డి స్మారక కళాపురస్కారాన్ని చెన్ను నాగేశ్వరరావుకు అందజేశారు. అనంతరం అభినవ ఎన్టీఆర్ నిమ్మగడ్డ మీరయ్యతో చెంచులక్ష్మి వీధి భాగవతం ప్రదర్శించారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు (రుద్రయ్య), డి.శ్రావణ్‌కుమార్, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, పి.జయభాస్కర్, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, గాడేపల్లి దివాకరదత్తు, రాచపూడి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

జిల్లా వైద్యశాలల కో–ఆర్డినేటర్ డాక్టర్ శేషుకుమార్


వేమూరు: పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యశాలల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు బాపట్ల జిల్లా వైద్యశాలల కో–ఆర్డినేటర్, వైద్యాధికారి శేషుకుమార్ పేర్కొన్నారు. వేమూరు మండల కేంద్రంలోని 30 పడకల వైద్యశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. వైద్యుల పనితీరును అడిగితెలుసుకున్నారు. రోగుల బెడ్‌లు, ఆపరేషన్ థియేటర్, రికార్డులను పరిశీలించారు. నూతనంగా నిర్మాణం జరుగుతున్న 30 పడకల వైద్యశాల భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా ప్రభుత్వ వైద్యశాలలు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యుల కొరత లేదన్నారు. వైద్యశాలల్లో అన్నిరకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. బాపట్ల జిల్లాలో 10 ప్రభుత్వం ప్రాథమిక వైద్యశాలలు, రెండు ఏరియా వైద్యశాలలు, 8 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయన్నారు. ఈ వైద్యశాలల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతోందని తెలిపారు. వైద్య సేవల పట్ల డాక్టర్లు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ మధుప్రభాకర్, వైద్యులు సీహెచ్ సింహాచలం, డి.అశోక్, డి.ఇందిరా ప్రియదర్శిని, షేక్ ఫాతిమ, మురళీకృష్ణ, రాధిక, సునీత పాల్గొన్నారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్ట్

18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు

చీరాల: మోటారుసైకిళ్ల దొంగను చీరాల వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణంలో కొంతకాలంగా మోటారు సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. వీటిపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అహ్మద్ జానీ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. పాత నేరస్తుడిని అదుపులోకి తీసుకుని విచారించగా మోటారు సైకిళ్ల దొంగతనం వెలుగులోకి వచ్చింది. అతని వద్ద నుంచి 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం వన్‌టౌన్ సీఐ వివరాలను వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరుకు చెందిన షేక్ వెంకన్న సాహెబ్ అలియాస్ కన్నా అనే పాత నేరస్తుడు విజయవాడ, గుంటూరు, చీరాల ప్రాంతాల్లో సంచరిస్తున్నాడు. తెల్లవారుజామున ప్రధాన కూడళ్లు, ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన మోటారుసైకిళ్లను మారు తాళాలతో దొంగిలించి విక్రయిస్తున్నాడు. గతంలో గుంటూరు ప్రాంతంలో ద్విచక్ర వాహనాలతో పాటు స్పేర్ పార్టులు కూడా అమ్మి సొమ్ము చేసుకున్నాడు. ఈ నేరస్తుడిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కాగా చీరాల, విజయవాడ, గుంటూరు, ఒంగోలు ప్రాంతాల్లో దొంగిలించినట్లుగా నిందితుడు అంగీకరించాడు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

ఎన్ఎంఎంఎస్‌లో రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు



బల్లికురవ: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు, బాపట్ల జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకును మాదాల హేమ ప్రవంతి సాధించినట్లు కొప్పరపాడు ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పరీక్షలో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ చూపడంతో శనివారం అభినందన సభ నిర్వహించారు. 8 వతరగతి చదువుతున్న మాదాల హేమప్రవంతి తల్లిదండ్రులు దానయ్య, నాగలక్ష్మిని సత్కరించారు. ఇదే పాఠశాల నుంచి వి.జాయిప్రిన్స్, ఎం.అక్షయబాయి, ఎం.రూపాబాయి, కె.అంజని జాహ్నవి, కె.వెంకట వైష్ణవి స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఉపాధ్యాయులు జి.నాగేశ్వరరావు, పి.విజయరోజ్, హెచ్ఎంతో పాటు పీడీ యంజ విష్ణుప్రసాద్‌ని పీజేసీ చైర్మన్ దమ్ము అంజయ్య, సర్పంచ్ బందారు వెంకాయమ్మ, గురవయ్య గ్రామ పెద్దలు అభినందించారు.